

సోమశిలలో 12.94 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో గురువారం సాయంత్రానికి 12.94 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయం నుంచి వివిధ కాలువలకు 2600 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.




బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.67,680
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,078
మూడు శాతం జీఎస్టీతో	రూ.6,260
నవర (8 గ్రాములు)	రూ.50,080

గరిష్టం/కనిష్టం
36.0 /25.0

వాతావరణం

గాలిలో తేమ 67 శాతంగా గురువారం నమోదైంది. ఉష్ణోగ్రతల్లో శుక్రవారం పెద్ద మార్పేమీ ఉండబోదని అధికారులు తెలిపారు.



న్యూస్‌రీల్

ముగిసిన ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలు



పొదలకూరులోని పీఎస్ ఎదుట సూచనలిస్తున్న ఆర్ఐఓ శ్రీనివాసులు

నెల్లూరు (టౌన్): ఇంటర్ ప్రథమ సంవత్సర పబ్లిక్ పరీక్షలు గురువారంతో ముగిశాయి. 26,479 మంది విద్యార్థులకు గానూ 25687 మంది హాజరయ్యారు. ఒకేషనల్‌కు సంబంధించి 774 మందికి గానూ 98 మంది గైర్హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా 39 కేంద్రాల్లో ఇంటర్ బోర్డు అధికారులు తనిఖీలు చేపట్టారు.

డీసీపల్లిలో 315 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో 315 బేళ్లను గురువారం విక్రయించారని వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 326 బేళ్లు రాగా వాటిలో 315 విక్రయమయ్యాయని చెప్పారు. 41,939 కిలోల పొగాకు విక్రయం కాగా, రూ.96,46,154 వ్యాపారం జరిగిందన్నారు. గరిష్ట ధర కిలో ఒక్కింటికి రూ.230 లభించిందని, వేలంలో 13 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారని తెలిపారు.

జగనన్న విద్యాదీవెన అమలు తీరుపై పరిశీలన



కొడవలూరు: నార్తురాజుపాళెంలోని వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో అమలవుతున్న జగనన్న విద్యాదీవెన పథకంపై బీసీ సంక్షేమ శాఖ ద్వారా ఢిల్లీ నుంచి వచ్చిన డెవలప్‌మెంట్ రీసెర్చ్ సర్వీసెస్ కేంద్ర బృంద అధికారులు బుధ, గురువారాల్లో పరిశీలించారు. 2022 - 23 విద్యా సంవత్సరానికి విద్యార్థులకు మంజూరైన జగనన్న విద్యాదీవెన రికార్డులను శివప్రసాద్, బాలచందర్ క్షుణ్ణంగా పరిశీలించారు. అర్హులైన 190 మంది విద్యార్థులకు సకాలంలో అందుతోందనే అంశాన్ని నిర్ధారించారు. ప్రిన్సిపల్ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోలంరెడ్డికి పొగబెట్టారు

కోవూరులో దినేష్‌రెడ్డికి సీటు నిరాకరణ

- రెండు దశాబ్దాల రాజకీయ జీవితానికి సున్నం
- చంద్రబాబు తీరుపై రగిలిపోతున్న వారి వర్గీయులు
- టీడీపీ అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి
- డబ్బు సంచులకే పెద్దపీట

టీడీపీ కోవూరు సీటు తనదేనని ధీమాగా ఉన్న పోలంరెడ్డి దినేష్‌రెడ్డికి ఆ పార్టీ అధినేత చంద్రబాబు కోలుకోలేని షాక్ ఇచ్చారు. రెండు దశాబ్దాల వారి రాజకీయ జీవితానికి ఫుల్‌స్టాప్ పెట్టేలా నిర్ణయం తీసుకున్నారు. తాజాగా టీడీపీ విడుదల చేసిన రెండో జాబితాలో కోవూరు అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పేరును ప్రకటించడం పోలంరెడ్డి కుటుంబాన్ని భంగపాటుకు గురిచేసింది.



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: చంద్రబాబు వ్యవహార శైలితో రాజకీయంగా బలైన వారి జాబితాలో తాజాగా పోలంరెడ్డి పేరు చేరింది. 15 ఏళ్ల పాటు టీడీపీని నమ్ముకున్న పోలంరెడ్డి కుటుంబానికి ఆ పార్టీ మొండిచేయి చూపింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి ఇటీవలే ఫిరాయించిన వేమిరెడ్డి కుటుంబానికి కోవూరు సీటును కట్టబెట్టారు. డబ్బు సంచులకే పెద్దపీట వేసిన చంద్రబాబు వ్యవహార శైలిపై పోలంరెడ్డి వర్గం రగిలిపోతోంది.

కీలకనేతగా పేరు

మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి కోవూరు నియోజకవర్గంలో టీడీపీలో కీలకనేత. 2004లో కాంగ్రెస్ తరఫున పోటీ చేసి విజయం సాధించారు. 2009లో కాంగ్రెస్, 2019లో టీడీపీ తరఫున పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2014లో టీడీపీ అభ్యర్థిగా విజయం సాధించారు.

పోటీకి అన్ని ఏర్పాట్లు

పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఆరోగ్య పరిస్థితుల నేపథ్యంలో తన రాజకీయ వారసుడిగా తనయుడు దినేష్‌రెడ్డికి పార్టీ బాధ్యతలను మూడేళ్ల క్రితం అప్పగించారు. తదనంతరం టీడీపీ అధిష్టానం సైతం దినేష్‌రెడ్డిని ప్రోత్సహించింది. పార్టీ వ్యవహారాలను చక్కబెడుతూ ఈసారి పోటీ చేసేది తానేననే ధీమాతో అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. కోవూరు నియోజకవర్గంలో ఇటీవల పర్యటించిన చంద్రబాబు.. యువగళం యాత్రలో లోకేశ్ సైతం పోలంరెడ్డి దినేష్‌రెడ్డికే సీటు ఇస్తున్నామని చెప్పి భారీగా ఖర్చు చేయించారు. అధినేతలే హామీ ఇవ్వడంతో ఎన్నికల ప్రచారాన్ని జోరుగా నిర్వహించారు.

అనుచరుల్లో ఆశలు.. అంతలోనే ఆవిరి

నియోజకవర్గంలో రోజూ పర్యటించి సీటు తనదేనంటూ అనుచరుల్లో ఆశలు నింపారు. విడవలూరు మండలం ముదివర్తిలో రెండు రోజుల క్రితం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సైతం కోవూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా దినేష్‌రెడ్డిని ఆశీర్వదించాలని చెప్పడంతో ఇక సీటు తనకే ఖరారైందని భావించారు. అయితే టీడీపీ విడుదల చేసిన రెండో జాబితాలో వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి సీటు ఖరారు కావడంతో కంగుతినడం దినేష్‌రెడ్డి వంతైంది.

జీర్ణించుకోలేని టీడీపీ శ్రేణులు

వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి కోవూరు సీటును ఖరారు చేయడాన్ని టీడీపీ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నాయి. పార్టీ ఫిరాయించిన వారికి అగ్రతాంబూలమివ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వీరిని అందలమెక్కించడం వెనుక డబ్బు మూటలే పనిచేశాయని ఆ పార్టీ నేతలే బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారు. పోలంరెడ్డికి చెక్ పెట్టి తమకంటూ ఒక నియోజకవర్గం ఉండాలనే వ్యూహంతోనే వారు కోవూరుపై కన్నేశారనే వాదనా వినిపిస్తోంది.

జామాయిల్ ద్వారా రూ.51 కోట్ల ఆదాయం



మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రావు

నెల్లూరు(అర్బన్): వన సంరక్షణ సమితిలు టెండర్ ద్వారా పొందిన జామాయిల్ తోటలను కటింగ్ చేయడం ద్వారా రూ.51 కోట్ల ఆదాయం సమకూరిందని జిల్లా అటవీ శాఖ అధికారి ఆవుల చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. వేదాయపాళెంలోని డీఎఫ్‌ఓ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ఫారెస్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ సర్వసభ్య సమావేశానికి గుంటూరు నుంచి స్క్వాడ్ డీఎఫ్‌ఓ మారుతిప్రసాద్, కావలి సబ్ డీఎఫ్‌ఓ రాజశేఖర్‌బాబు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రావు మాట్లాడారు. టెండర్ పొందిన వీఎస్‌ఎస్‌ల కాలపరిమితి ఈ నెలాఖరుతో ముగియనుందని చెప్పారు. 600కు గానూ సుమారు 300 ప్లాంటేషన్లలో జామాయిల్ కటింగ్ పూర్తయిందని చెప్పారు. ఈ తరుణంలో వీఎస్‌ఎస్‌ల కాలపరిమితిని మరో మూడు నెలల పాటు పొడిగించనున్నామని వివరించారు. ఈ నెలాఖరుకు మరో రూ.తొమ్మిది కోట్ల ఆదాయం లభించే అవకాశం ఉందని చెప్పారు. జామాయిల్ కటింగ్ ద్వారా రాష్ట్రంలోనే నెల్లూరు జిల్లాకు అత్యధిక ఆదాయం లభించడం సంతోషకరమన్నారు. కటింగ్ పూర్తయిన వెంటనే మరో ఎనిమిది వేల హెక్టార్లలో ఐటీసీ భద్రాచలం సహకారంతో కొత్త జామాయిల్ చెట్లను నాటనున్నామని వెల్లడించారు.



ఈబీసీ నేస్తం నమూనా చెక్కును లబ్ధిదారులకు అందజేస్తున్న ఆనం అరుణమ్మ, కల్యాణ్ చక్రవర్తి, హరినారాయణన్

అగ్రవర్ణ పేదలకు అండగా ఈబీసీ నేస్తం

- మూడో విడత నిధుల విడుదల
- జిల్లాలో 29,042 మంది లబ్ధిదారులకు రూ.43.56 కోట్లు
- ఎమ్మెల్సీ కల్యాణ్ చక్రవర్తి

నెల్లూరు(దర్గామిట్ట): ఆర్థికంగా వెనుకబడిన అగ్రవర్ణ పేదలకు అండగా నిలవాలనే గొప్ప సంకల్పంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న ఈబీసీ నేస్తం వారికెంతో తోడ్పాటునందిస్తోందని ఎమ్మెల్సీ బల్లి కల్యాణ చక్రవర్తి పేర్కొన్నారు. నంద్యాల జిల్లా బనగానపల్లె నుంచి ఈబీసీ నేస్తం మూడో విడత నిధుల విడుదలను సీఎం గురువారం నిర్వహించారు. కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణం నుంచి వర్చువల్‌గా నిర్వహించిన కార్యక్రమానికి జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, మేయర్ స్రవంతి, కలెక్టర్ హరినారాయణన్, ఎమ్మెల్సీ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కల్యాణ్ చక్రవర్తి మాట్లాడారు. ఆర్థికంగా వెనుకబడిన అగ్రవర్ణ కులాలకు చెందిన 45 నుంచి 60 ఏళ్లలోపు మహిళల బ్యాంక్ ఖాతాల్లో రూ.15 వేల చొప్పున జమ చేసిన సీఎంకు జిల్లాలోని అక్కచెల్లెమ్మల తరఫున కృతజ్ఞతలను తెలియజేశారు. ఈబీసీ నేస్తం ద్వారా జిల్లాలో ఇప్పటి వరకు మూడు విడతల్లో దాదాపు రూ.132 కోట్లను అందజేశారని చెప్పారు. అక్కచెల్లెమ్మల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిన సీఎంకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. అనంతరం ఈబీసీ నేస్తం ద్వారా జిల్లాలోని 29,042 మంది లబ్ధిదారులకు రూ.43.56 కోట్ల మెగా చెక్కును అందజేశారు. బీసీ కార్పొరేషన్ ఈడీ నిర్మలాదేవి, జిల్లా బీసీ సంక్షేమాధికారి వెంకటయ్య, సంచార జాతుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆసిఫా తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్సీపీ జెండాను రెపరెపలాడిద్దాం

- జిల్లాలో బలంగా పార్టీ
- ప్రతిపక్షాల విషప్రచారాలను తిప్పికొట్టండి
- ఖలీల్ అహ్మద్‌ను గెలిపించుకుందాం
- కార్పొరేటర్లతో ఎంపీ విజయసాయిరెడ్డి



కార్పొరేటర్లు, నేతలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న విజయసాయిరెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): రానున్న ఎన్నికల్లో జిల్లాలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండాను మరోసారి ఎగురవేసేందుకు అందరూ సన్నద్ధం కావాలని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త వేణుంబాక విజయసాయిరెడ్డి పిలుపునిచ్చారు. నగరంలోని తన కార్యాలయంలో కార్పొరేటర్లు, పార్టీ నేతలతో ప్రత్యేక సమావేశాన్ని గురువారం నిర్వహించారు. వారి అభిప్రాయాలు, సూచనలు, సలహాలను తెలుసుకున్న అనంతరం ఆయన మాట్లాడారు. మొదట్నుంచి జిల్లాలో పార్టీ చాలా బలంగా ఉందని, ఒకరిద్దరు పార్టీని వీడినంత మాత్రాన ఎలాంటి నష్టం ఉండబోదని చెప్పారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో చేసిన అభివృద్ధి, సంక్షేమంపై ప్రతిపక్షాలు చేస్తున్న విష ప్రచారాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్పొరేటర్లతో సమావేశం కావడం సంతోషంగా ఉందన్నారు. కార్పొరేషన్‌గా రూపాంతరం చెందాక జరిగిన మూడో ఎన్నికల్లో పార్టీ తరఫున గెలుపొందిన కార్పొరేటర్లు నగరాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. 54 డివిజన్లలో పార్టీ అభ్యర్థుల విజయం వెనుక సీఎం సుపరిపాలన.. జిల్లాలోని సీనియర్ నేతలు, కార్పొరేటర్ల కృషి ఉందని చెప్పారు.

నెల్లూరు నగరంలో తొలిసారిగా పార్టీ నగర నియోజకవర్గ సమన్వయకర్తగా మైనార్టీ వర్గానికి చెందిన ఖలీల్ అహ్మద్‌ను సీఎం ఎంపిక చేశారని తెలిపారు. మైనార్టీల సంక్షేమంపై సీఎంకు ఉన్న అంకితభావం దీని ద్వారా తెలుస్తోందని చెప్పారు. 1955లో ఉదయగిరి నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున మౌలానా సాహెబ్ గెలిచారని, ఆ తర్వాత ముస్లిం అభ్యర్థిని అసెంబ్లీకి పంపే అవకాశం ఇప్పటికి వచ్చిందని తెలిపారు. ఖలీల్ అహ్మద్‌ను అందరూ కలిసికట్టుగా గెలిపించుకుందామని చెప్పారు.

టీడీపీని ఓడించాలి

నెల్లూరు ఎంపీ సీటు జనరల్‌గా మారిన నాటి నుంచి ఇక్కడ టీడీపీ గెలుపొందలేదని, ఈ పార్లమెంట్ ఎన్నికల్లోనూ వారిని ఓడించి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలని కోరారు. పార్టీ నాయకత్వంతో సంప్రదించి దీర్ఘకాలిక సమస్యలను కొలిక్కి తీసుకొచ్చేందుకు అవసరమైన హామీలిస్తూ ఎన్నికల్లో చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. 2014, 2019 ఎన్నికల్లో విజయం సాధించిన అనిల్‌కుమార్‌కు నర్సరావుపేట లోక్‌సభ నుంచి పోటీ చేసే అవకాశం లభించిందన్నారు. పార్టీ తరఫున పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీ చేయనున్న అభ్యర్థుల అఖండ విజయానికి కృషి చేయాలని కోరారు. దీని ద్వారా రాజన్న రాజ్యం, సంక్షేమ పాలనను మరో ఐదేళ్లు కొనసాగించే అవకాశం లభిస్తుందన్నారు. రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి, పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ సమన్వయకర్త ఖలీల్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్‌లో మాయలు

పొదలకూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం మాయలకు వేదికగా మారింది. అవినీతికి అలవాటుపడిన కొందరి చేయి తడిపితే నిబంధనలకు విరుద్ధంగా అక్రమ రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. కోట్ల విలువైన భూములు సదరు యజమానులకు తెలియకుండానే రిజిస్టరైపోతున్నాయి. తాజాగా పొదలకూరులో ఖరీదైన ప్లాట్ రెవెన్యూ రికార్డులను మార్చేసి రిజిస్ట్రేషన్ చేసిన అంశం వెలుగులోకి వచ్చింది.

అవినీతికి నిలయంగా పొదలకూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

- భూ యజమానికి తెలియకుండానే మరొకరి పేరిట రిజిస్ట్రేషన్
- మంత్రి కాకాణి దృష్టికి తీసుకొచ్చిన బాధితులు
- అక్రమాలపై ఆ శాఖ ఐజీకి మంత్రి ఫిర్యాదు
- విచారణకు ఆదేశం



పొదలకూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

సాక్షి ప్రతినిధి నెల్లూరు: పొదలకూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అవినీతికి కేరాఫ్‌గా మారింది. ఇక్కడి సిబ్బంది చేతులు తడిపితే అక్రమం.. సక్రమమవుతున్నాయి. మార్కెట్ వాల్యూ విషయంలో సైతం తేడాలు చూపిస్తూ భూ యజమానులు నుంచి భారీగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరుగుతున్న అక్రమాలపై మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి బాధితులు తెలియజేశారు. దీంతో సంబంధిత రిజిస్ట్రేషన్ శాఖ ఐజీకి మంత్రి ఫిర్యాదు చేయగా, విచారణకు ఆదేశించారు.

అక్రమ రిజిస్ట్రేషన్ ఇలా..

పొదలకూరు రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 25 - 2లో 3.53 ఎకరాల భూమి ఉంది. సదరు భూమి వన్ బీ, అడంగళ్‌లో తల్లిక నరసయ్య పేరిట నమోదైంది. సదరు భూ యజమాని ప్లాట్లుగా విభజించి విక్రయాలు చేయసాగారు. అయితే అదే సర్వే నంబర్‌లోని ప్లాట్‌ను వెంకట నరసింహులుకు పిత్రార్జితంగా సక్రమించినట్లుగా నకిలీ రికార్డులను సృష్టించి రిజిస్ట్రేషన్ చేశారు. పొదలకూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో డాక్యుమెంట్ నంబర్ 3143 - 2023గా రిజిస్టర్ చేశారు. ఈ వ్యవహారం వెనుక భారీగా నగదు చేతులు మారిందనే ఆరోపణలున్నాయి.

మార్కెట్ వాల్యూలోనూ అవకతవకలు

భూముల విలువల్లో సైతం తేడాలు చెపుతూ భారీగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. రిజిస్ట్రేషన్ల సమయాల్లో డాక్యుమెంట్ రైటర్ల ద్వారానే లావాదేవీలను నిర్వహిస్తున్నారు. ఉదాహరణకు పొదలకూరుకు చెందిన శ్రీనివాసులురెడ్డి స్థానిక శ్రీనివాస లేఅవుట్లో ప్లాట్‌ను కొనుగోలు చేశారు. సదరు ప్లాట్ రిజిస్ట్రేషన్ కోసం డాక్యుమెంట్ రైటర్‌ను ఆశ్రయించి ప్రభుత్వం నిర్ణయించిన మార్కెట్ వాల్యూ ప్రకారం చలానా కట్టారు. తీరా రిజిస్ట్రేషన్ సమయంలో స్థానిక రిజిస్ట్రార్ మార్కెట్ వాల్యూ పెరిగిందని చెప్పి అదనపు మొత్తాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విలువ మేరకే చలానా తీశానని చెప్పినా వినిపించుకోలేదు. అధికారితో వాదన వద్దని.. రిజిస్ట్రేషన్‌కు అదనంగా రూ.50 వేలను సదరు డాక్యుమెంట్ రైటర్ డిమాండ్ చేశారు. దీంతో జిల్లా రిజిస్ట్రార్‌కు శ్రీనివాసులురెడ్డి ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన మార్కెట్ వాల్యూ ప్రకారమే చలానా కట్టించుకోమని సబ్ రిజిస్ట్రార్‌ను ఆదేశించడంతో వెనువెంటనే రిజిస్ట్రేషన్ చేశారు.

మంత్రి కాకాణి సీరియస్

పొదలకూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్ ప్రైవేట్ వ్యక్తుల ద్వారా అక్రమంగా వసూలు చేయిస్తున్నారని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి పలువురు ఫిర్యాదు చేశారు. తమ నియోజకవర్గ ప్రజలను ఇబ్బంది పెడుతూ అక్రమంగా వసూళ్లు చేయడంపై సీరియస్సైన మంత్రి సంబంధిత రిజిస్ట్రేషన్ శాఖ ఐజీ రామకృష్ణకు ఫిర్యాదు చేశారు. విచారణ చేయించి చర్యలు చేపట్టాలని సూచించారు. దీంతో సబ్ రిజిస్ట్రార్‌పై విచారణకు ఐజీ ఆదేశించారు.

స్పందనలో ఫిర్యాదు

పొదలకూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరుగుతున్న అవినీతిపై స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌కు బాధితులు ఫిర్యాదు చేశారు. కార్యాలయంలో ప్రైవేట్ వ్యక్తులను నియమించుకొని వారి ద్వారా వసూలు చేయిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ చేయాలంటే మార్కెట్ వాల్యూలో రెండు శాతాన్ని అదనంగా డిమాండ్ చేస్తున్నారని బాధితులు ఆరోపించారు. దీంతో సదరు ఫిర్యాదుపై విచారణకు ఆదేశించారు.

నివేదిక పంపుతాం

పొదలకూరు సబ్ రిజిస్ట్రార్‌పై ఆరోపణలు వచ్చిన మాట వాస్తవమే. అక్రమ రిజిస్ట్రేషన్లు చేశారనే ఫిర్యాదు మేరకు ఇటీవల విచారణ చేపట్టాం. నివేదికను ఉన్నతాధికారులకు పంపి వారి ఆదేశాల మేరకు చర్యలు చేపడతాం.

– బాలాంజనేయులు, రిజిస్ట్రార్, నెల్లూరు

'ఆరెస్సార్'లో 28న టెక్నోఫెస్ట్

బిట్రగుంట: బోగోలు మండలం కడనూతలలోని రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ స్థాయి టెక్నోఫెస్ట్‌ను ఈ నెల 28న నిర్వహించనున్నామని ప్రిన్సిపల్ డాక్టర్ పీవీఎస్ రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను కళాశాల అధ్యాపక బృందంతో కలిసి కళాశాలలో గురువారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. పేపర్, పోస్టర్ ప్రజంటేషన్లు, ప్రాజెక్ట్ ఎక్స్‌పో తదితర కేటగిరీల ద్వారా విద్యార్థుల నైపుణ్యాలను పెంపొందించనున్నామని చెప్పారు. కళాశాల ఏఓ రమణారెడ్డి, ప్రోగ్రామ్ కన్వీనర్ కృష్ణచైతన్య, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు సునీల్‌రెడ్డి, రామ్‌కుమార్, ప్రసాద్‌రెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

ముదిరాజ్ మహాసభ మహిళాధ్యక్షురాలిగా నారాయణమ్మ

నెల్లూరు(వేదాయపాళెం): ముదిరాజ్ మహాసభ నెల్లూరు జిల్లా మహిళాధ్యక్షురాలిగా నారాయణమ్మ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర నాయకుడు కొర్నా నారాయణ ముదిరాజ్ గురువారం ఒక ప్రకటనను విడుదల చేశారు.

టీడీపీని నమ్మి మోసపోవద్దు



శిలాఫలకాలను ఆవిష్కరిస్తున్న ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

• ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు సిటీ: 'రానున్న ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని చంద్రబాబునాయుడు మోసపూరిత వాగ్దానాలతో ప్రజల ముందుకొస్తున్నారు. ఆయన్ని ప్రజలు నమ్మి మరోసారి మోసపోవద్దని నెల్లూరు రూరల్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి సూచించారు. రూరల్ మండలం దొంతాలిలో గురువారం ఆయన పర్యటించారు. డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డితో కలిసి ఎంపీ నిధులు రూ.45లక్షలతో గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో జగనన్న కాలనీలో నివేశన స్థలాలు పొందిన లబ్ధిదారులకు ఉచిత రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ ఆదాల మాట్లాడుతూ దొంతాలి గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి ఆదర్శంగా నిలుపుతామన్నారు. ఎంపీ నిధులు రూ.5లక్షలతో నాంచారమ్మ చెరువు అలుగు, మరో రూ.5 లక్షలతో మట్టికట్ట పునరుద్ధరణ, జీజీఎంపీ నిధులు రూ.35లక్షలతో డ్రైనేజీల నిర్మాణాలను పూర్తి చేసి ప్రారంభించామని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి వర్గానికి మంచి చేసిన ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనన్నారు. పేద ప్రజల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి ఎలాంటి దళారీ వ్యవస్థ లేకుండా నేరుగా మహిళల ఖాతాల్లో నగదు జమ చేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌దేనన్నారు. ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రజలు గమనించి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని కోరారు. పార్టీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ హరిబాబు యాదవ్, ఎంపీపీ బూడిద విజయకుమార్, మర్రిపాడు జెడ్పీటీసీ మల్లు సుధాకర్‌రెడ్డి, సీనియర్ నాయకులు షేక్ ఖాజావలి, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు సూరిబాబు, నాయకులు చండి శేఖర్, చండీ సురేష్, బెల్లంకొండ వెంకయ్య, బెల్లంకొండ రమణయ్య, ప్రసాద్, మాజీ సర్పంచ్ రమణయ్య పాల్గొన్నారు.

వెన్నుపోటు చంద్రబాబు నైజం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

• కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు: నమ్ముకున్న వారికి వెన్నుపోటు పొడవడం చంద్రబాబు నైజమని ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి విమర్శించారు. గురువారం బుచ్చిరెడ్డిపాళెంలో పర్యటించిన ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడారు. ఎంతో కాలంగా టీడీపీని నమ్ముకుని ఉన్న వారికి వెన్నుపోటు పొడిచి కోటీశ్వరులకు చంద్రబాబు టికెట్లు అమ్ముకున్నారని ఆరోపించారు. రానున్న ఎన్నికలు కోవూరు నియోజకవర్గంలో పేదలు..నడమంత్రపు సిరికి మధ్యన జరుగనున్నాయన్నారు. డబ్బు సంచులతో టికెట్ పొందిన వారు ప్రజాక్షేత్రంలో ఓడిపోవడం తథ్యమన్నారు. నగదుతో ప్రజలను కొని గెలుద్దామనుకునే వారికి అది భ్రమగానే మిగిలిపోతుందన్నారు. ప్రస్తుతం నాయకుల కన్నా ఓటర్లు ఎంతో తెలివిగలవారన్నారు. తమకు మంచి చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలనే సంకల్పంతో ప్రజలు ఉన్నారన్నారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమ పాలన కోసం రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. చంద్రబాబును నమ్మి ఓటేస్తే సంక్షేమ పథకాలన్నీ కనుమరుగవుతాయన్నారు. గతంలో చంద్రబాబు పాలన ఏ విధంగా ఉందో ప్రజలు ఒక్కసారి గుర్తు చేసుకోవాలన్నారు. రానున్న ఎన్నికల్లో ఓటుకు భారీగా నగదు ఇస్తారని ప్రచారం జరుగుతోందని, ఒక వేళ ఇస్తే తీసుకుని సంక్షేమ ప్రభుత్వానికే ఓటేయాలని కోరారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ నుంచి కోవూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా తాను, నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థిగా విజయసాయిరెడ్డి పోటీ చేస్తున్నామని, తమను గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే వెంట బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ చైర్‌పర్సన్ సుప్రజ, వవ్వేరు బ్యాంకు చైర్మన్ మల్లికార్జునరెడ్డి, పార్టీ, పట్టణ, రూరల్ అధ్యక్షులు సతీష్‌రెడ్డి, మురళి, నాయకులు అల్లాభక్షు, కౌన్సిలర్లు, సర్పంచ్ వెంకటరమణారెడ్డి ఉన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి



విజయీభవ యాత్రలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

• విజయీభవ యాత్రలో ఆత్మకూరు ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

సోమశిల: రాష్ట్రాభివృద్ధి, సంక్షేమ పాలన కోసం రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి కోరారు. అనంతసాగరం మండలం గౌరవరం, మంగుపల్లి, కామిరెడ్డిపాడులో విజయీభవ యాత్రను గురువారం ఆయన నిర్వహించారు. ప్రజలతో మమేకమై ప్రభుత్వ, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో డీబీటీ, నాన్ డీబీటీ పథకాల ద్వారా గౌరవరంలో రూ.8.93 కోట్లు, మంగుపల్లిలో రూ.7.93 కోట్లు, కామిరెడ్డిపాడులో రూ.7.69 కోట్ల మేర లబ్ధి చేకూర్చినట్లు తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా రూ.40 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టామని వివరించారు. ఆత్మకూరు నియోజకవర్గానికి తాగు, సాగునీటిని అందించేందుకు సోమశిల హైలెవల్ కెనాల్ పనులను 2008లో అప్పటి ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి హయాంలో ప్రారంభించినట్లు తెలిపారు. వైఎస్సార్ మరణానంతరం కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు. ప్రస్తుతం ప్రతిపక్ష పార్టీ అభ్యర్థి హైలెవల్ కెనాల్‌ను తాను పూర్తి చేస్తానని చెబుతున్నారని, ఆయన గతంలో ఇక్కడి నుంచే ప్రాతినిధ్యం వహించారని, ఆ సమయంలో ఎందుకు పూర్తి చేయలేకపోయారని ప్రశ్నించారు. రానున్న మన ప్రభుత్వంలో మూడేళ్లలోనే హైలెవల్ కెనాల్ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ నుంచి నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థిగా విజయసాయిరెడ్డి, ఆత్మకూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా తాను పోటీ చేస్తున్నామని, ఫ్యాన్ గుర్తుకు ఓటేసి తమను గెలిపించాలని కోరారు. ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ, జేసీఎస్ కన్వీనర్ అక్కలరెడ్డి అంకిరెడ్డి, బొమ్మవరం సర్పంచ్ లక్ష్మీదేవి, మండల నాయకులు బట్రెడ్డి జనార్దన్‌రెడ్డి, శాప్‌డైరెక్టర్, ఎంపీటీసీ కాలువ నరసింహులు, సచివాలయ కన్వీనర్ చంద్రశేఖర్ నాయుడు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మూడు యూనిట్లలో విద్యుదుత్పత్తి

ముత్తుకూరు: నేలటూరులోని శ్రీదామోదరం సంజీవయ్య ఏపీ జెన్‌కో ప్రాజెక్ట్‌లో మూడు యూనిట్ల నుంచి విద్యుదుత్పత్తి జరుగుతోందని ప్రాజెక్ట్ ఇంజినీర్లు గురువారం తెలిపారు. 1వ యూనిట్లో 430, 2వ యూనిట్లో 500, 3వ యూనిట్లో 620 మెగావాట్ల చొప్పున విద్యుదుత్పత్తి జరుగుతున్నట్లు వెల్లడించారు.

పొగాకు బ్యారెన్ దగ్ధం

కొండాపురం: మండలంలోని ఆదిమూర్తిపురంలో నాదెండ్ల భారతికి చెందిన పొగాకు బ్యారెన్‌లో బుధవారం రాత్రి 10 గంటల సమయంలో అగ్నిప్రమాదం జరిగింది. పొగాకు క్యూరింగ్ చేస్తుండగా ఆకు గొట్టాలపై పడి ఒక్కసారిగా మంటలు ఎగసిపడ్డాయి. స్థానికుల సమాచారంతో వింజమూరు అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. అప్పటికే బ్యారెన్ పూర్తిగా దగ్ధమైంది. సుమారు రూ.2 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధితురాలు వాపోయారు.

వృద్ధురాలి ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): ఏం కష్టమొచ్చిందో ఏమో గుర్తుతెలియని 70 ఏళ్ల వృద్ధురాలు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన నెల్లూరు సౌత్ రైల్వేస్టేషన్ వద్ద నెల్లూరు వైపు వెళ్లే రైలు పట్టాలపై గురువారం చోటు చేసుకుంది. ప్రమాద ఘటనపై సమాచారం అందుకున్న నెల్లూరు రైల్వే ఎస్సై జీ మాలకొండయ్య ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతురాలి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాకపోవడంతో జీజీహెచ్ మార్చురీకి తరలించారు. ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు రౌడీషీటర్ల అరెస్ట్

• మూడు కేజీల గంజాయి స్వాధీనం

నెల్లూరు(క్రైమ్): గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న ఇద్దరు రౌడీషీటర్లను చిన్నబజారు ఇన్‌స్పెక్టర్ బీ అశోక్‌కుమార్ గురువారం అరెస్ట్ చేశారు. వారి నుంచి మూడు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల సమాచారం మేరకు..కోటమిట్ట ప్రాంతానికి చెందిన మక్బూద్ అలియాస్ పెద్ద మక్బూద్, షాహుల్‌పై చిన్నబజారు పోలీసు స్టేషన్‌లో రౌడీషీట్లు ఉన్నాయి. వీరు గత కొంతకాలంగా కోటమిట్ట మెక్లిన్స్‌రోడ్డుకు చెందిన ఇబ్రహీం, రేవంత్‌తో కలిసి గంజాయి విక్రయాలు సాగిస్తున్నారు. వీరి కదలికలపై పోలీసులు నిఘా ఉంచారు. గురువారం ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్ మెక్లిన్స్‌రోడ్డులోని ఇబ్రహీం ఇంటి సమీపంలో మక్బూద్, షాహుల్‌ను అరెస్ట్ చేశారు. వారి వద్దనుంచి రూ 30 వేల విలువ చేసే మూడు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన ఇద్దరి కోసం గాలిస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

17న ఆర్యవైశ్య ఆత్మీయ సేవా ప్రతిభా పురస్కారాల ప్రదానం



ఆర్యవైశ్య ప్రముఖులతో కలిసి ఆహ్వానపత్రికలను ఆవిష్కరిస్తున్న ద్వారకానాథ్

నెల్లూరు(బృందావనం): స్టోన్‌హౌస్‌పేటలోని ఎస్‌బీఎస్ కల్యాణ మండపంలో ఈ నెల 17న ఆర్యవైశ్య ఆత్మీయ సేవా ప్రతిభా పురస్కారాలు–2024 కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ గౌరవాధ్యక్షుడు, నుడా చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్ తెలిపారు. ఇందుకు సంబంధించిన ఆహ్వానపత్రికలను స్టోన్‌హౌస్‌పేటలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో ఆర్యవైశ్య సంఘాల ప్రముఖులతో కలిసి గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ద్వారకానాథ్ మాట్లాడుతూ ఆర్యవైశ్యులలో విశిష్ట సేవలందించిన వారితో పాటు వివిధ రంగాల్లో అత్యుత్తమ ప్రతిభకనబర్చిన బిడ్డలకు పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన వేయి మంది దంపతులను సత్కరించడంతో పాటు నూతన వస్త్రాలను అందజేయనున్నట్లు చెప్పారు. ఏప్రిల్ 9 నుంచి స్టోన్‌హౌస్‌పేటలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో నిత్యాన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఆర్యవైశ్య సంఘీయులు సంఘటితంగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు కోట సూర్యనారాయణ, గౌరవాధ్యక్షుడు పేర్ల సీతారామారావు, అధ్యక్షుడు బైసాని జ్యోతిప్రసాద్, వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానం పాలకమండలి చైర్మన్ శ్రీరాం సురేష్, రాచపూటి పెంచలకుమార్, ఐతా భాస్కర్, సుంకు మనోహర్, ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని ప్రైవేట్ హాస్టల్‌పై చర్యలు



బాలుర వసతి గృహంలో తనిఖీలు చేస్తున్న ఎంహెచ్ఓ వెంకటరమణ

నెల్లూరు(బారకాసు): ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ హెల్త్ యాక్ట్ మేరకు నిబంధనలు పాటించని వశిష్ట బాలుర ప్రైవేట్ కళాశాలకు అనుబంధంగా ఉన్న వసతిగృహంపై చర్యలు తీసుకున్నట్లు మున్సిపల్ హెల్త్‌ఆఫీసర్ డాక్టర్ వెంకటరమణ తెలిపారు. నగరంలోని 27/2 సచివాలయం పరిధిలో రిత్విక్ ఎన్‌క్లేవ్ ప్రాంతంలో ఉన్న వసతి గృహంపై ఫిర్యాదులు అందడంతో గురువారం ఆయన తన సిబ్బందితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాటర్ ట్యాంకులు, డైనింగ్ హాల్, టాయిలెట్లు, విద్యార్థుల గదులు అపరిశుభ్రంగా ఉండడం, నిల్వ ఆహార పదార్థాలు, మిగిలిన ఆహారం, ఇతర వ్యర్థాలను వసతి గృహం సమీపంలోనే డంప్ చేస్తూ పందులకు ఆవాసంగా మార్చడాన్ని గమనించినట్లు తెలిపారు. వసతి గృహ గదుల్లో నిర్దేశించిన పరిమితికి మించి విద్యార్థులను ఉంచడం వల్ల వారికి తగినంత గాలి, వెలుతురు అందక తరచూ అనారోగ్యాలకు గురవుతున్నట్లు విచారణలో తెలుసుకున్నామన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్న వశిష్ట కళాశాల వసతి గృహ యాజమాన్యానికి మూసివేత నోటీసు జారీ చేయడంతో పాటు కార్పొరేషన్ లైసెన్స్‌ను రద్దు చేశామని తెలిపారు. ఈ తనిఖీల్లో శానిటేషన్ సూపర్‌వైజర్లు శేషయ్య, నరసింహారావు, సచివాలయ శానిటేషన్ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్ ఫలితాల్లో విశ్వం ప్రభంజనం



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో యాజమాన్యం

తిరుపతి ఎడ్యుకేషన్ : 2024–25 విద్యాసంవత్సరంలో సైనిక్ స్కూల్ ప్రవేశాలకు జాతీయ స్థాయిలో నిర్వహించిన ప్రవేశ పరీక్ష మొదటి విడత ఫలితాల్లో తిరుపతిలోని విశ్వం విద్యాసంస్థ విద్యార్థులు 270 మంది అర్హత సాధించారని ఆ విద్యాసంస్థ అధినేత ఎన్ విశ్వనాథరెడ్డి తెలిపారు. ప్రతిభకనబర్చిన విద్యార్థులను కరస్పాండెంట్ తులసీ విశ్వనాథరెడ్డి, అకడమిక్ డైరెక్టర్ ఎన్ విశ్వచందన్‌రెడ్డితో కలిసి గురువారం ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరో తరగతి ప్రవేశ పరీక్షలో ఆరాధ్య 300 మార్కులకు 275, 9వ తరగతి ప్రవేశ పరీక్షలో శశాంక్ 400 మార్కులకు 352, లోచన్ 336 మార్కులు సాధించారని వివరించారు. అలాగే రిషిత, నితీష్, వెనిష్‌రెడ్డి, పద్మినిరెడ్డి, ఆర్యన్‌రెడ్డి, జయసూర్య సాయికుమార్, సాకేత్, లిఖ్వింత్, భరత్, అయాన్, మహిధర్, రసజ్ఞ, దీక్షిత్, లిఖిత, గంగా జైదీష్, సాత్విక్, హరిచరణ్, పూజ, ట్వింకిల్ తదితరులు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ర్యాంకులను సాధించారని తెలిపారు.

ఎన్నికల విధులు బాధ్యతగా నిర్వహించండి



మాట్లాడుతున్న జేసీ, ఆర్వో సేతు మాధవన్

కోవూరు : ఎన్నికల నోడల్, సెక్టోరియల్, పోలీసు అధికారులు తమ విధులను బాధ్యతగా నిర్వహించాలని కోవూరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జేసీ సేతు మాధవన్ సూచించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎన్నికలకు సంబంధించిన నోడల్, సెక్టోరియల్, పోలీసు అధికారులకు ఎన్నికల విధులపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్వో మాధవన్ మాట్లాడుతూ ఎన్నికల విధులు నిర్వహించే ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. కేటాయించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలన్నారు. సెక్టోరియల్ అధికారులు పోలింగ్ బూత్‌లలో మౌలిక సదుపాయాలు ఎన్నికల కమిషన్ నిర్దేశించిన నియమ నిబంధనలకు లోబడి ఉన్నాయా..లేదా అనే విషయాలను పరిశీలించుకోవాలన్నారు. ఈవీఎంలపైన పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. తహసీల్దార్ విజయశ్రీ, ఎలక్షన్ డీటీలు మధుసూదన్‌రావు, రవికుమార్, తదితరులు ఉన్నారు.

వేసవి క్రీడా శిక్షణా శిబిరాలకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జిల్లాలో వేసవి క్రీడా శిక్షణా శిబిరాల నిర్వహణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఆర్కే యతిరాజ్ గురువారం తెలిపారు. రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏటా వేసవి సెలవుల్లో గ్రామీణ, పట్టణ, నగర ప్రాంతాల్లో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ ఏడాది మే 1 నుంచి 31వ తేదీ వరకు శిబిరాలు నిర్వహించేందుకు నిర్ణయించామన్నారు. ఆసక్తి కలిగిన క్రీడా శిక్షకులు ఈ నెల 25లోగా htt pr:// bit.ly/DSA-SCC-2024 వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 88862 28444 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

సూపర్ మార్కెట్లో చోరీ



నగదు చోరీ జరిగిన టేబుల్‌ను చూపుతున్న యజమాని

మనుబోలు: స్థానిక కోదండరామపురంలోని శివబాలాజీ సూపర్ మార్కెట్లో బుధవారం అర్ధరాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. షట్టర్‌ను వంచి లోనికి ప్రవేశించిన దొంగలు టేబుల్ సొరుగులోని రూ.8,500 నగదును మాయం చేశారు. గురువారం ఉదయం సూపర్ మార్కెట్‌ను తెరిచేందుకు వచ్చిన యజమాని షట్టర్‌ను వంచి ఉండడం గమనించి సీసీ పుటేజ్‌ను పరిశీలించారు. అర్ధరాత్రి 2 గంటల సమయంలో సూపర్‌మార్కెట్ వద్దకు వచ్చిన ముగ్గురు దొంగల్లో ఇద్దరు షట్టర్‌ను అరడుగు మేర వంచి లోపలికి ప్రవేశించగా, మరో వ్యక్తి బయట కాపలా ఉండడం గుర్తించారు. చోరీకి పాల్పడిన ముగ్గురు ఉత్తర భారతదేశానికి చెందిన వారిలా ఉన్నారని సూపర్‌మార్కెట్ యజమాని తెలిపారు. ఇదే వ్యక్తులు ఇటీవల గూడూరులోని ఓ ఫుట్‌వేర్ షాపు, చిల్లకూరు బైపాస్‌లోని పెట్రోల్ బంకుల్లోనూ చోరీలకు పాల్పడినట్లుగా చెబుతున్నారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

నిమ్మధరలు (కిలో)



పెద్దవి :	రూ.85
సన్నవి :	రూ.75
పండ్లు :	రూ.30

నెల్లూరు పౌల్ట్రీ ధరలు



బ్రాయిలర్:	రూ.126
లేయర్	రూ.73
బ్రాయిలర్ చికెన్:	రూ.224
స్కిన్‌లెస్ చికెన్:	రూ.250
లేయర్ చికెన్:	రూ.125